క్లుప్తంగా

సీపీకి ఆహ్వానం



కాజీపేట: పట్టణంలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 10న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి పూజలకు సీపీ అంబర్ కిశోర్ ఝాను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ, బెదరకోట రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నయీంనగర్: ఆచార్యా ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఈ నెల 19న హనుమకొండలో జరగనున్న వేమన భగవాన్ ఊరేగింపు వేడుకల ఆహ్వాన పత్రికను ఆదివారం హనుమకొండ ఏకశిల రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ముద్దసాని వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాడ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. వెంకటాచార్యులు, రాధిక, శశికాంత్, దివ్య, రాజు, భార్గవి, రాజలింగం పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సూచనలు

మడికొండ: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మడికొండ చౌరస్తాలో ఆదివారం మడికొండ ఎస్‌హెచ్‌ఓ కిషన్ ఆటో డ్రైవర్లుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆటోలో నలుగురికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదని అన్నారు. ప్రతీ ఒక్క ఆటో డ్రైవర్ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆదేశించారు. యూనిఫామ్ తప్పనిసరి అని సూచించారు.

ఎన్నిక

హసన్‌పర్తి: ఆర్యవైశ్య సంఘం హసన్‌పర్తిశాఖ అధ్యక్షుడిగా వెలగందుల భీష్మనాథం ఎన్నికయ్యారు. హసన్‌పర్తిలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఈ ఎన్నికలో సంఘం ప్రధాన కార్యదర్శిగా చిదర కరంచంద్, కోశాధికారిగా ముంచెన శ్యాం సుందర్, ఉపాధ్యక్షులుగా గౌరిశెట్టి వెంకటేశ్వర్లు, చిదర భాస్కర్, సహాయ కార్యదర్శులుగా అనుగం సతీశ్, చిదర రఘు, కార్యవర్గసభ్యులుగా విజయ్, కట్కూరి కిరణ్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చకిలం రాజేశ్వర్‌ను నామినేట్ చేస్తూ తీర్మానం చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మునిందర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించిన అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

రాజేందర్‌కు డాక్టరేట్



రాజేందర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధకుడు రాజేందర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈమేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ శనివారం ప్రటనలో పేర్కొన్నారు. వరంగల్ కిట్స్‌లోని ప్రొఫెసర్ ఈశ్వరయ్య పర్యవేక్షణలో రాజేందర్ పీహెచ్‌డీ పూర్తిచేసినట్లు తెలిపారు.

'ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది'

నయీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ రైతు భరోసా పేరిట చేసిన మోసంపై పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ వేదికగా ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఉత్తదే అయిందని ఎద్దేవా చేశారు. నైతిక విలువలు ఉంటే సిఎం రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాగూర్ల వెంకన్న, యాదవ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, పులి రజినీకాంత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బిల్లా మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాసుదేవరెడ్డి, కోశాధికారిగా బొప్పి ఉమారాణి, ప్రచార కార్యదర్శిగా స్వరూప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివాజీ, బాధ్యులుగా రమేశ్‌ను ఎన్నుకున్నారు. నర్సమ్మ, రాములు, సోమన్న, రవీందర్, మహ్మద్‌ఫసిఉద్దీన్, రాజమౌళి పాల్గొన్నారు.

అనాథ, వృద్ధాశ్రమాల్లో పుట్టిన రోజు వేడుకలు

హన్మకొండ: సులక్ష్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మండువ సంతోష్ గత పదిహేడు సంవత్సరాలుగా తన పుట్టిన రోజును అనాథ, వృద్ధాశ్రమాల్లో జరుపుకుంటున్నాడు. ఇందులో భాగంగా ఆదివారం హనుమకొండలోని ఒయాసిస్ అనాథాశ్రమం, ఏకశిల వృద్ధాశ్రమంలో వేడుకలు జరుపుకున్నారు. అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, అన్నదానం చేశాడు. వృద్ధులకు పండ్లు, బాదం పాలు, పల్లీ పట్టీలు పంచారు. కార్యక్రమంలో శివ, సంపత్, కాత్యాయని, రాహుల్, వినయ్, కౌశిక్, ఒద్దిరాజు చంద్రప్రకాశ్, రాధ పాల్గొన్నారు.

మొరం.. అక్రమం

మడికొండ శివారులో మొరం అక్రమ డంపింగ్
- రాత్రి సమయంలో డంపు.. ఉదయం తరలింపు
- భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మడికొండ శివారులో డంపు చేసిన మొరం



మొరం తరలిస్తున్న టిప్పర్

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారు ఔటర్ రింగ్ రోడ్డు పక్కన అక్రమంగా మొరం డంపు చేస్తూ ఉదయం యథేచ్ఛగా నగరంలోకి తరలిస్తూ కొందరు అక్రమార్జనకు తెరలేపారు. నగర పరిధిలోని పలు గ్రామాల్లోని ఈ మొరం నిత్యం తరలిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. నగర పరిధిలోని మడికొండ, తరాలపల్లి, అమ్మవారిపేట, కుమ్మరిగూడెం, ముప్పారం, నారాయణగిరి తదితర గ్రామాల నుంచి రాత్రి సమయంలో మొరం తరలిస్తూ మడికొండ శివారులో డంపు చేస్తున్నారు. ఉదయం నగరంలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది, మైనింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో మొరం మాఫియాదే ఇష్టారాజ్యం అన్నట్లుగా కొనసాగుతోంది. మడికొండ శివారు, కుమ్మరిగూడెం, తరాలపల్లి, కడిపికొండ శివారులలోనూ రాత్రులు మొరం తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మొరం వ్యాపారులతో చేతులు కలిపి కొత్తగా నిర్మిస్తున్న స్థలాలకు ఈ మట్టిని తరలిస్తూ రాత్రికి రాత్రి వేలల్లో ఆదాయం పొందుతున్నారు. మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మొరం వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వాహనాలతో రోడ్ల ధ్వంసం



మొరం లోడుతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు మొత్తం ధ్వంసం అవుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించాలంటేనే ఇబ్బందిగా ఉంటుంది. గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం మడికొండ చౌరస్తాలో మొరం టిప్పర్ ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి కాలు విరిగిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొరం తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలి.

– కుక్కల సమ్మయ్య, రిటైర్డ్ ఉద్యోగి, మడికొండ

కార్మికుల సంక్షేమానికే వినియోగించాలి

- సీడబ్ల్యూఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాజు



మాట్లాడుతున్న కోటం రాజు

హసన్‌పర్తి: సెస్స్ రూపంలో వసూలవుతున్న నిధిని రాష్ట ప్రభుత్వం తెలంగాణ భవననిర్మాణ కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు డిమాండ్ చేశారు. పెగడపల్లిలో ఆదివారం నిర్వహించిన పెయింటర్స్, భవన నిర్మాణ మేస్త్రీల సమావేశంలో కోటం రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 25,95,695 మంది కార్మికులు తమ పేర్లను సంక్షేమ బోర్డు కార్యాలయంలో నమోదు చేసుకున్నారని చెప్పారు. అయితే అందులో 11,95,695 మంది కార్మికులు తిరిగి రెన్యూవల్ చేసుకోలేదన్నారు. ప్రభుత్వ ప్రచారం లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. పలు పథకాలను అమలు అమలవుతున్నప్పటికీ కార్మికులకు సరైన అవగాహన లేక వినియోగించుకోవడం లేదన్నారు. కార్మికులు తమ పేర్లను సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి పెండ్యాల రవి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్, నాయకులు లెనిన్, సారంగపాణి, దాస్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రాజబీరయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- బైపాస్ రోడ్డు బాధితుల డిమాండ్

వరంగల్: ఇన్నర్ రింగ్ రోడ్‌లో బైపాస్ రోడ్డు ప్రతిపాదనలో తన జీవనాధారమైన పంట భూమి పోతుందని మనస్తాపం చెంది ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఆరెపల్లి గ్రామ రైతు దయ్యాల రాజబీరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బైపాస్ రోడ్డు ప్రతిపాదనను రద్దు చేసుకోవాలని పైడిపల్లి, ఆరెపల్లి బైపాస్ రోడ్డు బాధితులు, రైతులు డిమాండ్ చేశారు. మృతి చెందిన రైతు కుటుంబాన్ని బైపాస్ రోడ్డు బాధితులు ఆరెపల్లిలో ఆదివారం పరామర్శించారు. సుంకరి ప్రశాంత్, బుద్దె గణేశ్, రావుల రామేందర్‌రెడ్డి, దయ్యాల మల్లయ్య, బిజిలీ సంపత్, ఎండి.అంజద్, అల్లాడి శ్రీను, కమలాపురం జితేందర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలతో ఆర్థికస్వావలంబన

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హన్మకొండ కల్చరల్ : ఆర్థికస్వావలంబనకు పొదుపు సంఘాలు ఎంతగానో దోహదపడతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం హనుమకొండ విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం, పొదుపు సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో వేల్పుల దేవాచారి, విష్ణువర్ధన్, శ్రీధర్, బ్రాహ్మచారి, కరుణాకర్, సూర్యనారాయణ, సారంగపాణి, విద్యాసాగర్, దేవేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్ : తెలంగాణ సైకాలజిస్టుల సంఘం డైరీని ఆదివారం నగరంలోని టీపీఏ కార్యాలయంలో తెలంగాణ సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి రామచంద్రం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీవిద్య, సభ్యులు డాక్టర్ శివుడు, సునీత, నిర్మల, శ్రీకాంత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసాచార్య స్వామి

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ వికాస్‌నగర్‌లోని శ్రీగోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం మారుతి ఎలక్ట్రికల్స్ అధినేత గుర్రం సదానందం ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కేంద్రం నిర్వాహకులు శ్రీఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్రం సభ్యులు వెన్నపురెడ్డి రమణారెడ్డి, సరళ దంపతులు, భద్రాచలం బంజార రామాలయం నిర్వాహకులు రాంరెడ్డి, చంద్రకళ, భారతి, సౌమ్య, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



దీక్షలో మాట్లాడుతున్న సింగారపు బాబు

వరంగల్ అర్బన్: పారిశుద్ధ్య కార్మికులు, జవాన్లకు కనీస వేతనాలు అమలు చేయకపోతే మార్చి నెలలో అసెంబ్లీని ముట్టడిస్తామని సీఐటీయూ వరంగల్ జిల్లా కోశాధికారి సింగారపు బాబు హెచ్చరించారు. ఆదివారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట రెండో రోజు దీక్షలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి, ఏడాది గడిచినా కార్మికుల సమస్యలపై కనికరించకపోవడం దురదృష్టకరమన్నారు. జీఓ 60 ప్రకారం చట్టాలను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ నాయకులు జన్ను ప్రకాశ్, సింగారపు కృష్ణ, సుమన్, నవీన్, శివకృష్ణ, బొజ్జ రాజు, అనిల్, అనిల్, కవిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మస్కులర్ డిస్ట్రోపి బాధితులకు వైద్యశిబిరం



చికిత్స పొందిన బాధితులు

ఎంజీఎం : భారత్ ఎండీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఆదివారం మెగా జెనెటిక్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. సెంటర్ ఫర్ డీఎన్ఏ తో కలిసి పిడియాట్రిక్ రేర్ జెనెటిక్ డిసార్డర్స్ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ బారినపడిన కుటుంబాలకు భరోసా ఇవ్వడానికి అంకితమైన లాభాపేక్ష లేని సంస్థ భారత్ ఎండీ ఫౌండేషన్ అని అన్నారు. వ్యాధిని నివారించడంతోపాటు కొత్త కేసులు లేకుండా చేయడమే లక్ష్యంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో హైదరాబాద్, సంగారెడ్డిలో జరిగిన రెండు శిబిరాల్లో 200 మందికిపైగా తమ తల్లిదండ్రులు, సోదరులతో కలిసి స్క్రీనింగ్ చేయించుకున్నారని మూడవ శిబిరం వరంగల్‌లో నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ముదిరాజ్ వరల్డ్ డాట్ కామ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



వేణు, సతీశ్‌ను సన్మానిస్తున్న మెపా బాధ్యులు

హన్మకొండ: హనుమకొండలోని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ముదిరాజ్ వరల్డ్ డాట్ కామ్ వెబ్‌సైట్‌ను అసోషియేషన్ బాధ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ మాట్లాడుతూ.. ఈ వెబ్‌సైట్‌లో ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ వివరాలు పొందుపరిచినట్లు వివరించారు. వ్యాపారవేత్తలు, ఉద్యోగులు ఈ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. వెబ్‌సైట్ రూపకర్త మోరె వేణు మాట్లాడుతూ.. ఈ వెబ్‌సైట్ ఫ్రీ అని తెలిపారు. ఈ సందర్భంగా వెబ్‌సైట్ రూపకర్త వేణు, కానుగ సతీశ్‌ను సన్మానించి, పెద్దమ్మ తల్లి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, శ్యామ్‌సుందర్, రాజు, చిరంజీవి భిక్షపతి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో ఆదరణ

- అనిక బజాజ్‌లో 20వ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న షోరూం ఎండీ సురేందర్‌రావు

వరంగల్: వరంగల్‌లో ద్విచక్ర వాహనాల విక్రయాల షోరూం ప్రారంభించి గత ఇరువై ఏళ్లుగా మెరుగైన సేవలందించడం వల్ల వినియోగదారులు తమను ఆదరిస్తున్నారని అనిక బజాజ్ షోరూం జీఎం గిరిధర్ తెలిపారు. ములుగురోడ్డు సమీపంలోని అనిక బజాజ్ షోరూం ప్రారంభించి 20ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా షోరూం ఎండీ వి.సురేందర్‌రావు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో గిరిధర్ మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా లోన్ మేళాతోపాటు మెగా ఎక్సేంజ్ ఆఫర్ ఇస్తున్నామని, ఎంపిక చేసిన మోడల్స్‌పై రూ.10వేల వరకు డిస్కౌంట్, డౌన్‌పేమెంట్ రూ.4999 నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ ఆఫర్లు ఈనెల 20వ తేదీ వరకు అమలులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో షోరూం అకౌంట్స్ మేనేజర్ సుధాకర్, వర్క్ మేనేజర్ ప్రవీణ్, సేల్స్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ఒకేరోజు మూడుచోట్ల చోరీ

మామునూరు: నగరంలోని మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు చోట్ల, మడికొండలో ఓ వైన్స్‌లో చోరీలకు పాల్పడ్డారు. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి నాయుడు పెట్రోల్‌బంక్ సమీపాన ఏ వన్ వైన్ షాపును రోజువారిగానే శనివారం రాత్రి షెట్టర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెట్టర్ తాళం ధ్వంసం చేసి వైన్ షాపులోకి ప్రవేశించారు. మద్యం బాటిళ్లు ముట్టకుండా కేవలం కౌంటర్‌లోని రూ.54వేల నగదును అపహరించుకుపోయారు. షాపు నిర్వాహకుడు రత్నాకర్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అలాగే మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెగ్సిన్, క్యాప్స్, కూలింగ్ గ్లాసెస్ విక్రయించే డబ్బాలో సైతం చోరీ జరిగింది. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి జాతీయ రహదారిపై డబ్బా ఏర్పాటు చేసి బైక్ సీట్ల రెగ్సిన్ ,క్యాప్స్, కూలింగ్ గ్లాసెస్ విక్రయిస్తున్నాడు. శనివారం సాయంత్రం డబ్బాకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఉదయాన్నే డబ్బా తెరిచేందుకు చిరంజీవి రాగా.. డబ్బాలో చోరీ జరిగినట్లు గుర్తించి మామునూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. పోలీసులు చేరుకుని చోరీ జరిగినతీరును పరిశీలించారు. సుమారు రూ.50వేల విలువైన సామగ్రి అపహరించి ఉంటారని బాధితుడు పేర్కొన్నట్లు తెలిసింది. అయితే నిజామాబాద్‌కు చెందిన అంతర్రాష్ట దొంగల ముఠా వరంగల్ వైపు బయల్దేరారా..? మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల చోరీలు, ఐనవోలు పోలీస్‌స్టేసన్ పరిధిలో మరో చోరీ జరిగింది. ఈచోరీలకు ముఠాకు సంబంధం ఉండి ఉంటుంద అనేనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం.

వైన్‌షాప్‌లో చోరీ

మడికొండ: మడికొండలోని కింగ్స్ వే వైన్‌షాపులో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు యజమాని తెలిపారు. వైన్‌షాప్ యజమాని కథనం ప్రకారం. శనివారం రాత్రి షాప్ మూసేసి ఇంటికి వెళ్లగా రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కౌంటర్‌లోని రూ.20వేలు అపహరించారని తెలిపారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

కాజీపేట: కాలనీవాసుల సహకారం, సమన్వయంతో ప్రశాంత్‌నగర్ కాలనీని అభివృద్ధి చేయడానికి అంకితభావంతో తమ కమిటీ పని చేస్తుందని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుకడు బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీ పార్క్‌లో ఆదివారం నూతన కమిటీ సభ్యులు పదవి బాధ్యతలతోపాటు ప్రమాణం చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బైరి రవికృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వాసం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పి.సంపత్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎం.సురేశ్, కోశాధికారిగా బి.అశోక్ కుమార్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా డి.కోమల్ రెడ్డి, ఎ.శ్రీనివాస్ తదితరులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

బ్లాంకెట్స్ పంపిణీ

వరంగల్: సావిత్రిబాయిపూలే జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని 19వ డివిజన్ ప్రతాప్‌నగర్‌లోని పట్టణ నిరుపేద భవన్‌లోని 25 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఆదివారం జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రహీంఖాన్, సభ్యులు వాసు, తాహేర్, హోమ్ లెస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

మామునూరు: మామునూరులోని హిందూ బంధువుల స్మశాన అభివృద్ధి కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. బండి సాంబయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో.. అధ్యక్షుడిగా మాచర్ల యాదగిరి, కోశాధికారి బండారి కోటేశ్వర్‌ను ఎన్నుకున్నారు. లక్ష్మారెడ్డి, కుమారస్వామి, భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమసమాజాన్ని నిర్మించాలి

న్యూశాయంపేట: సమసమాజాన్ని నిర్మించడం మార్క్సిజానికే సాధ్యమని మార్క్సిస్టు అధ్యయన వేత్త నేదునూరి రాజమౌళి అన్నారు. ఆదివారం హనుమకొండలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి, అధ్యక్షతన రాజకీయ అధ్యయన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడారు. శిక్షణా తరగతుల్లో నేదునూరి జ్యోతి, ఎల్లేశ్, ఎం.భిక్షపతి, లక్ష్మణ్, సారంగపాణి, రాజుగౌడ్, సదానందం, శంకర్, దీనా, వెంకట్రాజం, సుదర్శన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ శివారు ప్రాంతాల్లో నేడు(సోమవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్టుపల్లి, కొత్తపల్లి, సైనిక్ పురి, అమ్మవారిపేట ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అవార్డుకు ఎంపిక

హన్మకొండ కల్చరల్: వరంగల్‌కు చెందిన ప్రముఖ పేరిణి నాట్యాచార్యులు, నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ వ్యవస్థాపకుడు గజ్జెల రంజిత్‌కు సింగిడీస్ డిస్టింగ్యుస్ట్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. నేడు(సోమవారం) హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగే సిండిగి ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్ –2025 కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు.

నియామకం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అయోధ్యపురానికి చెందిన జెరిపోతుల విల్సన్‌మాదిగను తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట సమితి(టీఎమ్మార్పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్న టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ ఆదివారం ఉత్తర్వులను అందజేశారు. పదవిలో నియమించినందుకు సమితి పెద్దలకు విల్సన్ కృతజ్ఞతలు తెలిపారు.

డ్యాన్స్ విద్యార్థులకు బహుమతులు

హన్మకొండ కల్చరల్ : గోవా ఏబీడీఏ ఆధ్వర్యంలో రెండురోజులపాటు గోవాలో నృతార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హనుమకొండకు చెందిన ది టెంపుల్ డ్యాన్స్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌కి చెందిన కూచిపూడి నృత్య విద్యార్థి అనిశ్రిత రెడ్డి సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంది. వివిధ విభాగాలలో చన్విత గజం, జనన్య వర్మ, స్వాతి కశ్యప్ బహుమతులను అందుకున్నారు. నృత్య గురువు హిమాన్సి కాత్రగడ్డ వారిని అభినందించారు.

డిప్యూటీ సీఎంకు వినతి

హసన్‌పర్తి: మండలంలోని సూదన్‌పల్లి–మల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన విక్రమార్కను కలిసిన రైతులు బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్ నర్సింహారెడ్డి, నాయకులు మధన్‌గౌడ్, భగత్, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి టీయూడబ్ల్యూజేయూ(ఐజేయూ) సభ్యత్వ నమోదు

వరంగల్: ఈనెల 18నుంచి టీయూడబ్ల్యూజేయూ (ఐజేయూ) నూతన సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రామచందర్ తెలిపారు. ఆదివారం వరంగల్ లక్ష్మీపురంలోని తూర్పు జర్నలిస్టు భవనంలో రాంచందర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు స్వామి, వెంకన్న, కోశాధికారి శ్రీనివాస్, గోపాలకృష్ణ, అశోక్, సతీశ్ కుమార్, జగదీష్, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సన్మానం

కాజీపేట: కాజీపేట పట్టణంలో కొలువుదీరిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 37ఏళ్లుగా క్రమం తప్పకుండా దీక్ష స్వీకరిస్తూ అరుదైన ఘనతను సాధించిన బుర్ర జనార్దన్ గౌడ్‌ను ఆదివారం భక్తులు ఘనంగా సన్మానించారు. 1988లో మొట్టమొదటి సారిగా గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షను చేపట్టారు. అనతి కాలంలోనే జనార్దన్ గౌడ్ అయ్యప్ప భక్తులతో కలిసి అతి పెద్ద దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. ఆలయంలో ఎటువంటి విఘ్నాలు లేకుండా నిత్య కైంకర్యాలు, మండల పూజలు, సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో బంగారు కుమారస్వామి, పాక శ్రీనివాస్, భస్కె దశరథం, దండిగం సదానందం, విజయ్ కుమార్, ఆవాల పురుషోత్తమ్ రెడ్డి, పిల్లల కుమారస్వామి, గౌని సాంబయ్య గౌడ్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘనస్వాగతం



డిప్యూటీ సీఎం భట్టికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్ సత్యశారద



నిట్‌లో డిప్యూటీ సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నాయిని, తదితరులు

వరంగల్/కాజీపేట అర్బన్ : వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు. నిట్ వరంగల్‌కు విచ్చేసిన డిప్యూటీ సీఎంకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఈవీ శ్రీనివాసరావులు పూలమొక్క అంజేసి స్వాగతం పలికారు.

25 ఏళ్ల ఆత్మీయ సమ్మేళనం



వరంగల్ చౌరస్తా: వరంగల్ పిన్నవారి వీధిలోని శాంతినికేతన్ హై స్కూల్ 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం హంటర్ రోడ్డులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నవారు ఉత్సాహంగా పాల్గొని అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి, గతంలో గడిపిన కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు సందీప్, ప్రసాద్, అజయ్ కుమార్, వినయ్ కుమార్, రాజు, నరేశ్, అరుణ్, చిరంజీవి, భాస్కర్, శ్రీకాంత్, శాలిని, పావని తదితరులు పాల్గొన్నారు.